ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024 5 విజయనగరం



3న జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

డిఇఒ మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవరి మూడో తేదిన నగరంలోని సెయింట్ ఆన్స్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు డిఇఒ యు.మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలిజికల్ మ్యూజియం, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సహకారంతో దక్షిణ భారత స్థాయిలో ఈ ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. భౌతిక శాస్త్రం, కెమిస్ట్రీ, గణితం, ఎర్త్/స్పేస్‌సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే అంశాలపై ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యుత్తమంగా నిలిచిన 3 టీచర్ ప్రాజెక్టులు, 3 వ్యక్తిగత ప్రాజెక్టులు, 3 గ్రూపు ప్రాజెక్టులు.. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలలో జిల్లా తరుపున ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.



అనగనగా ఒక జిల్లా అధికారి. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు సెలవు పెట్టారు. 26న తిరిగి విధుల్లోకి చేరాల్సి ఉంది. కానీ, సెలవు పొడిగించుకుంటారంటూ చాలా మంది నోట వినిపించింది. అంతా భావించినట్టే ఈనెల 29వ తేదీ వరకు ఆ అధికారి సెలవు పొడిగించుకున్నట్టుగా సమాచారం. ఈ విషయం కాస్త పక్కనబెడితే.. ఆ అధికారి సెలవు తెరవెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్టుగా అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇందుకు తగ్గట్టే కొన్ని పరిణామాలు కూడా కనిపిస్తున్నాయి. అలా సెలవుపై వెళ్లిన అధికారి ఎవరో కాదు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి.

- మూడు సెలవు దినాలకే వేరొకరికి పూర్తి అదనపు బాధ్యతలా!
- తెరవెనుక అదృశ్య శక్తి ఎవరో?

పీడీ సెలవు వెనుక ఆంతర్యం ఏమిటో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం మారినప్పుడల్లా గ్రామ స్థాయిలో పనిచేస్తున్న చిరుద్యోగులు, గౌరవ వేతనాలపై బతుకీడుస్తున్న కార్యకర్తల గుండెలపై కుంపటి మన జిల్లాలో కొత్త కాదు. ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం మారగానే ఇటువంటి హడావుడి ఎక్కువగానే కనిపిస్తోంది. అందులో భాగంగానే తనను అన్యాయంగా తొలగించారంటూ గజపతినగరం మండలం రామన్నపేటలో అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న మానాపురం సౌజన్య ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన యూనియన్ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల కలిసి గజపతినగరంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఆందోళన చేపట్టారు. చివరికి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు, భారీ ధర్నా చేపట్టారు. ఐసిడిఎస్ పీడీ, కలెక్టర్, జిల్లాకు చెందిన ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కూడా వినతిపత్రాలు అందజేశారు. అంతకు ముందే రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిని కూడా యూనియన్ నాయకులు, బాధితురాలు కలిశారు. అయినా వీరి నుంచి సానుకూలత కనిపించకపోవడంతో ఓవైపు తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే యూనియన్ అండతో బాధితురాలు హైకోర్టులో న్యాయపోరాటం కూడా చేస్తున్నారు. దీనిపై ఈ నెల 19న న్యాయస్థానంలో జరిగిన వాద, ప్రతివాదనలలో సౌజన్యకు సానుకూలంగా వినిపించాయి. దీంతో, ఆ మరుసటి రోజు (ఈనెల 20వ తేదీ) రోజు నుంచే ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి సెలవులోకి వెళ్లడం గమనార్హం. దీంతో, పీడీ తీరు వల్లే హెల్పర్ తొలగింపు వ్యవహారం కోర్టు వరకు వెళ్లిందని భావించిన ఓ నేత రాజకీయంగా ఒత్తిడి చేసి సెలవు పెట్టించి ఉంటారన్న సందేహాలు అంగన్‌వాడీలు, హెల్పర్లతోపాటు ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాల పాఠశాల పారిధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్‌వర్కర్ల నోట వ్యక్తమౌతున్నాయి.

ఇందుకు తగ్గట్టే పీడీ సెలవులు, ఆమె స్థానంలో పూర్తి అదనపు బాధ్యత ఉత్తర్వులు కూడా కనిపిస్తున్నాయని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు తగ్గట్టే పరిణామాలు కూడా ఉన్నాయి. పీడీ సెలవు పెట్టిన ఆరు రోజుల్లో 22, 25 తేదీలు ఆదివారం, క్రిస్మస్ కారణంగా ప్రభుత్వ సెలవు దినాలు. లీవ్ లెటర్‌లో 24వ తేదీన ఆప్షనల్ హాలీడేగా పరిగణించారు. మిగిలిన మూడు రోజులు (20, 21, 23 తేదీలు)ను మాత్రమే క్యాజువల్ లీవ్స్‌గా పరిగణించారు. సాధారణంగా మూడు రోజుల సెలవులకు అదే శాఖలోని సెకెండ్ లెవెల్ ఆఫీసర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తారు? కానీ, శాంతకుమారి విషయంలో ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. అది కూడా పూర్తి అదనపు బాధ్యత. మూడు రోజులకే ఎఫ్ఎసి బాధ్యతలు వేరొక శాఖ అధికారికి అప్పజెప్పడం వెనుక కలెక్టర్‌పై కూడా ఒత్తిడి ఉన్నట్టుగా అర్థమౌతుందని, ఇంత స్వల్ప కాల వ్యవధికి ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించిన సందర్భాలు చాలా అరుదుగా ఉంటాయని కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. అంతే కాదు.., సౌజన్యను తొలగిస్తూ గత నెల 30న గజపతినగరం సిడిపిఒ పి.నాగమణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 2 నుంచి సౌజన్య తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఆందోళనకు దిగడంతో మంగళవారం నుంచి నాగమణి సెలవులోకి వెళ్లిపోయారు. తిరిగి సౌజన్యకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు వచ్చాక ఈనెల 24న విధుల్లోకి చేరడం కొసమెరుపు. సౌజన్య అక్రమ తొలగింపుపై తమ పోరాటం, అటు రాజకీయ ఒత్తిడి తట్టుకోలేకే సిడిపిఒ సెలవుపై వెళ్లిపోయారని, వ్యవహారం కొలిక్కిరావడంతో తాజాగా విధుల్లో చేరారని అంగన్‌వాడీలు, ఆయాలు, ఆ యూనియన్ నాయకులు చర్చించుకుంటున్నారు. సౌజన్యతోపాటు ఐసిడిఎస్‌లో పని చేస్తున్న చాలామందిని తీసేయడానికి గ్రామ, మండల స్థాయిలో చాలా కుట్రలు జరుగుతున్నాయని, కొన్ని పోస్టుల భర్తీలో కూడా అడ్డగోలు ప్రయత్నాలు సాగుతున్నాయని, అవన్నీ జరగాలంటే కోర్టు వరకు వెళ్లే పరిస్థితి లేకుండా పనిచేసే అధికారిని రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అంటున్నారు. ఈ విషయం బహిర్గతమయ్యాక 'మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు' అంటూ పీడీతో ప్రకటనలిప్పించినా ఆశ్చర్యం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇంతకీ ఆ అదృశ్య శక్తి ఎవరో సర్కారుకే ఎరుక.

వరికి పరిహారం లేనట్టేనా?

- కోసిన పంటకు వర్తించదంటున్న బీమా నిబంధనలు
- తల్లడిల్లుతున్న రైతన్న

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విజయనగరం మండలం కోరుకొండపాలెంలో ధాన్యం మొలకెత్తాయంటూ ఆవేదన చెందుతున్న రైతులు

కొనబోతే కొరివి... అమ్మబోతే అడవి అన్న సామెతకు తగ్గట్టుగా ఉంది జిల్లాలోని వరి రైతుల పరిస్థితి. చేతికి అందిన ధాన్యం విక్రయించాలంటే ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి చేశారు. కానీ, అదే ఇ-క్రాప్ ఆధారంగా వర్తించాల్సిన బీమాకు నిబంధనలు అడ్డంకి వస్తున్నాయి. దీంతో జిల్లాలో సుమారు 1600 ఎకరాల్లో వందలాది మంది రైతులకు బీమా వర్తించే పరిస్థితి కనిపించడం లేదు. నష్టాల్లో కూరుకుపోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఈ ఏడాది 2,40,580 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో కొద్దిరోజుల క్రితం ప్రారంభమైన వర్షాల నాటికి 2,36,590 ఎకరాల మేర కోతలు పూర్తయ్యాయి. వర్షాల నేపథ్యంలో అధికారుల హెచ్చరికల మేరకు 2400 ఎకరాల్లో రైతులు వరికోతలు వాయిదా వేసుకున్నారు. ఈ లెక్కన 1590 ఎకరాల మేర పంట పొల్లాల్లోనే ఉండిపోయింది. ఈ విధంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. పోనీ, ఇ-క్రాప్ నమోదులో రైతుల తరపున ప్రభుత్వం చెల్లించిందంటున్న ప్రీమియానికి బీమా కూడా వర్తించే పరిస్థితి లేదని సమాచారం. బీమా పథకంలో కేవలం పంట కోతకు ముందే వర్తిస్తుందట. ఈ లెక్కన పొలాల్లో తడిసి ఉన్న పంటకు ఫసల్ బీమా పథకం వర్తించే అవకాశం లేదు. ప్రస్తుతం పొలాల్లోనే ఉండిపోయిన ధాన్యం పూర్తిగా రంగుమారిపోయే అవకాశం ఉంది. కనీసం వీటినైనా కొనుగోలు చేస్తారా? లేదా? అన్నది అనుమానమేనంటూ రైతులు కన్నీరు పెడుతున్నారు. అధికార యంత్రాంగం మాత్రం నాలుగు రోజుల క్రితానికి 238 ఎకరాల్లో చేను పూర్తిగా తడిసిపోయినట్టుగా, ఈ మేర విస్తీర్ణంలో 460 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగుమారే అవకాశం ఉన్నట్టుగా గుర్తించింది. ఇప్పటికైనా వర్షం తెరిపి ఇవ్వకపోతే మరింత నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

ఇప్పటికే కోసిన వరిలో 1,12,247 ఎకరాల పంట మేర నూర్పులు అయ్యాయని, వీటి నుంచి 2,10,772 మెట్రిక్ టన్నుల మేర దిగుబడి రాగా, 2,04,531 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రైతు సేవా కేంద్రాల సిబ్బంది షెడ్యూలింగ్ కూడా ఇచ్చారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



యాదవ్‌కుమార్(ఫైల్)

శ్రీలీల (ఫైల్)

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు ● ఎడమ భాగంలో కూర్చున్న ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- భోగాపురం

విశాఖపట్నంలో జరిగే బంధువుల పెళ్లి కోసం చెన్నై నుంచి కుటుంబమంతా కలిసి రెండు రోజుల కిందట వచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు నలుగురూ కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో దంపతులు అక్కడకక్కడే మృతి చెందారు. వారి కుమారుడికి స్వల్ప, కోడలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన భోగాపురం మండలం లింగాలవలస పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది.

తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన అశోక్‌కుమార్ విశాఖపట్నంలో బంధువుల పెళ్లికి తల్లిదండ్రులు, భార్యతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చాడు. గురువారం ఉదయం అశోక్‌కుమార్ కారులో వారంతా శ్రీకాకుళం జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిసి దర్శించుకుని, తిరుగు పయనమయ్యారు. లింగాలవలస పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొంది. దీంతో కారులో ఎడమవైపు కూర్చున్న తండ్రి నగిశెట్టి యాదవ్ కుమార్ (82), వెనుక సీట్లో కూర్చున్న తల్లి శ్రీలీల (71) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న అశోక్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన వెనుక సీట్లో కూర్చున్న భార్య ప్రసన్నకు తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి వారిని తరలించారు. ఈ సమాచారం అందుకున్న సిఐ ప్రభాకర్, ఎస్ఐ సూర్యకుమారి, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రమాదం కారణంగా ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇటీవల శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు మృతిచెందిన ఘటనా స్థలం వద్దే ఈ ప్రమాదమూ చోటుచేసుకోవడం గమనార్హం.

కారులో చిక్కుకున్న మృతదేహాలు

లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో కారు ఎడమ భాగమంతా నుజ్జునుజ్జయింది. దీంతో భార్యాభర్తల మృతదేహాలు అందులో చిక్కుకున్నాయి. అటుగా వెళుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సంఘటనా స్థలానికి వెళ్లి, బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఊరు కాని ఊరు వచ్చి భార్యభర్తలు ఇక్కడ మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండొచ్చని సిఐ ప్రభాకర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, అధికారులు

నిబంధనలు పాటించకుంటే ఆస్పత్రులు సీజ్

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆస్పత్రుల వ్యర్థాల నిర్వహణపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలక ప్రక్రియ అని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని జాగ్రత్తగా, నిర్ణీత సమయంలోగా తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా పర్యవేక్షక కమిటీ సమీక్షా సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణకు జిల్లాలో తీసుకున్న చర్యలను పొల్యూషన్ ఇంజినీర్ బిబి సరిత వివరించారు. ప్రతి ఆస్పత్రిలో నిర్దేశిత రంగుల్లో ప్రత్యేక చెత్త బుట్టలను ఏర్పాటు చేసి, వ్యర్థాలను వాటిల్లోనే వేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనిపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలో 20 పడకలకు పైబడి ఉన్న సుమారు 560 ప్రయివేటు ఆస్పత్రులు, ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు పశుసంవర్ధక ఆస్పత్రుల నుంచి కూడా చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. అన్ని ఆసుపత్రులను జనవరి ఐదో తేదీలోగా నమోదు చేసి, చెత్త తరలింపును ప్రారంభించాలని ఆదేశించారు. ఈ నిబంధనలను పాటించని ఆస్పత్రులను సీజ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు.. ప్రయివేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలని సూచించారు.

2.5 శాతం తగ్గిన వాయు కాలుష్యం

1 నుంచి నగరంలో వాకింగ్ జోన్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలో వాయు కాలుష్యం సుమారు 2.5 శాతం తగ్గిందని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై తన ఛాంబర్‌లో కలెక్టర్ గురువారం సమీక్షించారు. పట్టణంలో వాయు కాలుష్య తీవ్రతను తెలుసుకున్నారు. గతంలో తీసుకున్న చర్యల ఫలితాలపై సమీక్షించారు. నగరంలో జనవరి ఒకటో తేది నుంచి వాకింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలుత స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచ్ నుంచి గంటస్థంభం వరకు వాకింగ్ జోన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్తు వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు నగరంలో రెండు సోలార్ ఛార్జింగ్ స్టేషన్లను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. పచ్చదనాన్ని పెంచేందుకు ఒకేసారి సుమారు 50 వేల మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఇంటి ఖాళీ స్థలంలో నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మూడు కార్యక్రమాలను జనవరి 26న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కల్తీ నిరోధించేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ ఇంజినీర్ సరిత, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిటిసి మణికంకర్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ హరిప్రసాద్, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, డిఎస్ఒ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీగా శారదాదేవి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎస్.శారదాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శారదాదేవి శృంగవరపుకోట అదనపు పీడీగా విధులను నిర్వహిస్తూ, పీడీగా నియమితులయ్యారు. పీడీగా బాధ్యతలు స్వీకరించిన శారదాదేవికి డ్వామా సిబ్బంది అభినందనలు తెలిపారు.



డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శారదాదేవి

డిజిటల్ పద్ధతిలో రుణాల వసూళ్లు

స్త్రీనిధి ఎమ్‌డి హరిప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్త్రీనిధి రుణాలను వంద శాతం డిజిటల్ పద్ధతిలో వసూలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జివిబిడి హరిప్రసాద్ ఆదేశించారు. గురువారం డిఆర్‌డిఎ కార్యాలయంలో జిల్లాలోని స్త్రీనిధి అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల లక్ష్యం ఈ నెల 31వ తేదిలోగా పూర్తి చేయాలన్నారు. రుణ బకాయిలు 30 రోజులు మించరాదని స్పష్టంచేశారు. స్త్రీనిధి రుణ వసూళ్లకు డిజిటల్ పేమెంట్ ద్వారా విజయనగరం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు వివరించారు. పిఎం కుసుమ కార్యక్రమానికి స్త్రీనిధి ద్వారా రుణం అందించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. స్త్రీనిధి ద్వారా ఇప్పటి వరకు చేసిన రుణాల పత్రాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, ఎజిఎం ఎ.ఉమామహేశ్వరరావు, స్త్రీనిధి మేనేజర్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్త్రీనిధి ఎమ్‌డి హరిప్రసాద్

సూర్యఘర్ పథకానికి స్త్రీనిధి రుణాలు

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడానికి ఎస్‌సి, ఎస్‌టిలకు స్త్రీనిధి నుంచి రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. కోరారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన స్త్రీనిధి ఎమ్‌డి జివిబిడి హరిప్రసాద్.. జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుణాల మంజూరుపై చర్చించారు. జిల్లాలోని స్వయంశక్తి సంఘాల్లో సుమారు 55 వేల మంది ఎస్‌సి, ఎస్‌టి మహిళలు ఉన్నారని, శతశాతం లక్ష్యంగా వీరందరికీ సూర్యఘర్ పథకం కోసం రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు.

అమిత్‌షా వ్యాఖ్యలు.. రాజ్యాంగాన్ని అవమానించడమే

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను ఉద్దేశించి కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానించడమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అభిప్రాయ పడ్డారు. గురువారం స్థానిక అమర్ భవన్‌లో సిపిఐ శత వార్షికోత్సవ వేడుకలను జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను రమణ ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిదన్నారు. ప్రస్తుతం అధికారం చెలాయిస్తున్న మతోన్మాద బిజెపి ఆనాడు ఏ ఉద్యమాలూ చేయలేదని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని చెప్పారు. అధికారం అనుభవిస్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను ప్రధాని మోడీ వెనకేసుకు రావడం దారుణమన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మీద పార్లమెంట్ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి అమిత్ షాకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.రంగరాజు, ఎ.జగన్నాథం, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.సునీల్, తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు చేసి, 12వ పిఆర్‌సి ప్రకటించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గురువారం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ వర్కర్లకు సంక్రాంతి కానుక రూ.వెయ్యి, 21 మంది పారిశుధ్య కార్మికులకు 7 రోజుల సమ్మె జీతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ వర్కర్లకు జిఒ 36 ప్రకారం పారిశుధ్య కార్మికులతో సమానంగా బేసిక్ వేతనం ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు, పదేళ్ల సర్వీస్ పైబడిన తర్వాత ప్రతి సంవత్సరానికి అదనంగా రూ.2 వేలు చెల్లిస్తామన్న హామీని అమలుచేస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంపు హౌస్, లీకులు, వాల్ ఆపరేటర్లు, ప్లాంటేషన్, పార్కులు, ఎలక్ట్రికల్, ఆఫీస్ అసిస్టెంట్, నైట్ శానిటేషన్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కార్మికులకు టెండర్ ప్రకారం ప్రతి నెలా పదో తేదీలోపు జీతం చెల్లించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు 3 నెలల హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. విలీన ప్రాంత కార్మికులకు కార్పొరేషన్ ద్వారా చెల్లిస్తున్న రూ.15 వేలు వేతనం కొనసాగించాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ జనాభా విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎ.రాఘవ, సురేష్, నాగలక్ష్మి, రమ, కుమారి, నాయుడు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం రూరల్, గంట్యాడ పోలీసు స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. నమోదైన, దర్యాప్తులో, కోర్టు ట్రయల్‌లో ఉన్న గ్రేవ్ కేసులను సమీక్షించి, దర్యాప్తు తీరును అడిగి తెలుసుకొన్నారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంకల్పం కార్యక్రమం ద్వారా యువత, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తొలుత పునర్నిర్మించిన రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్‌పి ప్రారంభించారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, రూరల్ ఎస్ఐ ఎస్ఐ అశోక్ కుమార్, గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

అదుపులోనే డయేరియా

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని జమ్ము గ్రామంలో డయేరియా అదుపులో ఉందని డిఎంహెచ్ఒ భాస్కరరావు తెలిపారు. గురువారం జమ్ము గ్రామంలో ఆయన పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. ఆరుగురు డయేరియా బాధితులు కోలుకొంటున్నారని ఆయన తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డయేరియా ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. డిపిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు.

టెన్త్ పరీక్ష ఫీజుకు 10 వరకు గడువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు రూ.వెయ్యి అపరాధ రుసుంతో జనవరి పదో తేది వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని డిఇఒ మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ స్కీం ద్వారా ఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైటులో స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలని చెప్పారు. సిఎఫ్ఎంఎస్‌లో బ్యాంకు చలానాలు అనుమతించరని తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు అందరూ విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

జైలు నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న డిఐజి

విజయనగరంకోట, బొబ్బిలి: మండలంలోని సారిక గ్రామ సమీపంలో జిల్లా జైలు నిర్మాణానికి కోస్తాంధ్ర జైళ్ల శాఖ డిఐజి ఎం.ఆర్.రవికిరణ్.. గురువారం స్థల పరిశీలన చేశారు. సారిక సమీపంలో ఉన్న ఏడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. జైలు నిర్మాణానికి 10 ఎకరాల స్థలం అవసరం కాగా, సారిక సమీపంలో 7 ఎకరాల ప్రభుత్వ స్థలం మాత్రమే అందుబాటులో ఉందని డిఐజి రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సబ్ జైళ్ల శాఖ ఇన్‌ఛార్జి ఎస్.శివప్రసాద్, సబ్‌జైల్ పర్యవేక్షణాధికారి బి.సంపత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన

డిఐజి రవికిరణ్ గురువారం ఎరకందొరవలస సబ్ జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సబ్ జైలు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో నూతనంగా సబ్ జైలు నిర్మించడానికి స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఆర్‌యుబిలో నీరు బయటకు తోడాలి

బొబ్బిలి: స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జిలో ఉన్న నీరు బయటకు తోడాలని సిపిసి సభ్యులు ముప్పల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అండర్ బ్రిడ్జిను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ బ్రిడ్జిలో నీరు ఉండటంతో మల్లమ్మపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీరు ఎక్కువగా ఉండడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. నీరు బయటకు తోడాలని కోరారు. ఆయనతో కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా సిపిఐ వార్షికోత్సవ వేడుకలు

బొబ్బిలి: సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బొబ్బిలి జండా మహల్ సెంటర్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కండాపు ప్రసాదరావు పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జరిగే పోరాటంలో సిపిఐ అగ్రగామిగా నిలిచిందన్నారు. దున్నేవారికి భూమి దక్కాలంటూ ఉద్యమం చేసిందని, భూ సంస్కరణల చట్టం కోసం పోరాడి లక్షలాది ఎకరాలు భూ పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, పట్టణ నాయకులు వై బాబ్జీ, వెంకట సత్యనారాయణ, పలువురు ఏఐటియుసి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమానురాగంతో శత్రువుల మనస్సు గెలవాలి

బొబ్బిలి: ప్రేమానురాగంతో శత్రువుల మనస్సు గెలవాలని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెసి రాజు అన్నారు. స్థానిక లూథరన్ చర్చిలో గురువారం క్రిస్మస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, అనురాగం ఉంటే శత్రువుల మనస్సును గెలవచ్చునన్నారు. సమాజ అభివృద్ధికి సామాజిక బాధ్యతగా పని చేయాలన్నారు. హృదయ వికలాంగుల ఆశ్రమానికి ఆహార పదార్థాలకు రూ.25వేలు, వస్త్రాలకు రూ.35వేలు అందించినట్లు ఫాస్టర్ జాన్ విక్టర్ చెప్పారు. స్నేహితులు, పేదలకు గిఫ్ట్ బాక్సులు పంపిణీ చేశారు.

క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలి

నెల్లిమర్ల: రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఏఈఓ ఎ. టి. సంగీత సూచించారు. గురువారం ఆమె కొండవెలగాడలో మొక్కజొన్న, అపరాల పంటలను సందర్శించి అధిక వర్షాలతో నష్టపోకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వేణుబాబు, వసంత రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని నల్లబిల్లి ప్రాథమికోన్నత పాఠశాలను, బక్కు నాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల చేత ఇంగ్లీష్, తెలుగు, హిందీ చదివించి రాయించారు. పాఠాలు వినసరా, గార్డెన్, టాయిలెట్స్, వంటగది, తరగతి గదులు, ఉపాధ్యాయుల డైరీలు, పాఠశాల రికార్డులు పరిశీలన చేశారు.

30న మెగా జాబ్‌మేళా

గజపతినగరం: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మండల కేంద్రంలోని శ్రీ సాయి సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 30వ తేదీన మెగా రిక్రూట్ మెంట్ డ్రైవ్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించనున్నారని టిడిపి సీనియర్ నాయకులు కొండపల్లి కొండబాబు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని ఇటువంటి సదావకాశాన్ని నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. అందుకు సంబంధించిన గోడ పత్రికలను రిక్రూట్ మెంట్ నిర్వాహకులు కోళ్ల సుగుణాకర్‌తో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఆల్తి సన్యాసిరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గిరిజనులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ పరిధిలో ఉన్న బొడ్డవర, లక్ష్మీపురం గ్రామాల్లో పలువురు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఆల్తి అప్పారావు, బుచ్చిబాబు, సన్యాసిరావు, బాబూరావు, గ్రామ పెద్దలు దేవాపురపు దేముడు, పి.రామకృష్ణ, డి.నగేష్, డి.శంకర్, ఆర్వణ్, బి.నాగరాజు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఎపిఒ బదిలీ

భోగాపురం: ఉపాధి హామీ పథకంలో మండల ఎపిఒగా పనిచేస్తున్న మహదాను ఆదిబాబుకి బదిలీ అయింది. ఆయనకు చీపురుపల్లి మండలం ఎపిఒగా బదిలీ కావడంతో గురువారం సాయంత్రం ఆత్మీయ విధులు స్వీకరణ చారు. చీపురుపల్లి ఎపిఒగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి ఇక్కడకు రానున్నారు.

ప్రశాంతంగా డీలర్ పోస్టులకు రాత పరీక్ష

బొబ్బిలి: స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో గురువారం డీలర్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షలను ఆర్‌డిఒ రామ్మోహ నరావు పరిశీలించారు. మెరిట్ ఆధారంగా డీలర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

రహదారులు పరిశుభ్రంగా ఉంచాలి

విజయనగరం టౌన్: నగరంలోని రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం నగరంలోని రింగ్‌రోడ్, దాసన్నపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, పారిశుధ్య విధానాన్ని గమనించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోగాలు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రింగ్‌రోడ్డు వద్ద ఫ్లెక్సీ జంక్షన్ కాలువలో తీసిన పూడికను రహదారిపై వేసే ఉండడాన్ని గమనించారు, తక్షణమే తొలగించాలని అక్కడ ఉన్న పారిశుధ్య పర్యవేక్షకులను ఆంజనేయులును ఆదేశించారు. ప్రజారోగ్య సిబ్బంది నిర్ణీత సమయానికి పనులకు హాజరవుతున్నారా? లేదా అన్నది గమనించారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా అలసత్వం వహించినా క్షమించేది లేదని హెచ్చరించారు.

ఒబిసి విభాగం జిల్లా అధ్యక్షులుగా తారకేశ్వరరావు

విజయనగరంకోట: కాంగ్రెస్ పార్టీ ఒబిసి విభాగం జిల్లా అధ్యక్షులుగా తారకేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఎస్. నాగరాజు హాజరయ్యారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల ఒబిసి విభాగాలకు కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తెస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి మహేష్, డిసిసి అధ్యక్షుల విద్యాసాగర్, శ్రీకాకుళం ఒబిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, నాయకులు గదం వెంకటరమణ, షరీఫ్, కరీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రామవరం రూరల్ ఫీడర్ లైన్ కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగిస్తున్నట్లు విజయనగరం అర్బన్ డిఇఇ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పెనసాం, చినమానాపురం, గోటివాడ, కిర్తుబర్తి, బుడతనాపల్లి గ్రామాలకు, తాటిపూడి రూరల్ ఫీడర్ పరిధిలో ఉన్న మదనాపురం, తాటిపూడి, చినమధుపాడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. గుర్ల మండలంలోని నాగళ్లవలస సబ్ స్టేషన్ పరిధిలో నడిమివలస, జమ్ము, జమ్మపేట, నాగళ్లవలస, గొలగాం, వల్లాపురం, దమరసింగి, గడవ, చిన నాగళ్లవలస, శేషయ్యపేట గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

రెవెన్యూ సదస్సులతో రైతుకు మేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రెవెన్యూ సదస్సులతో రైతుకు ఎంతో మేలు జరుగుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెసి సేతుపతి మాధవన్ కోరారు. గురువారం సీతారాముని పేటలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ సదస్సులకు హాజరై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. ముఖ్యంగా రీసర్వే లోపాలు, పేర్లు తప్పులు అడంగల్, 1బి వంటి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. తహశీల్దార్ పి. సుదర్శనరావు, ఆర్ఎస్ డిటి ఎం.సత్యనారాయణ, సర్వేయర్ దివ్య పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కొంపల్లి రెవెన్యూ సదస్సులో 11 దరఖాస్తులు స్వీకరించామని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సదస్సుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.


నెల్లిమర్ల: సమావేశంలో మాట్లాడుతున్న జెసి మాధవన్

ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయ సర్వేయర్లు, పాల్గొన్నారు.

రేగిడి: ఎన్నో ఏళ్లగా తమ గ్రామంలో భూ సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించి కొత్త పాస్ పుస్తకాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బూరాడ గ్రామ రైతులు రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ చిన్నారావును కోరారు. గురువారం చిన్న శిర్లాం, బూరాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులకు వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. టిడిపి నాయకులు టంకాల గోవిందరావు, శ్రీనివాసరావు, సర్పంచ్ నాగభూషణరావు, ఆర్ ఐ రేవతి, విఆర్ఒ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంకోట : మండలంలోని సారిక గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్ఐ ఎస్ఎస్ఎన్ రాజు పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, కంది జగదీశ్వరి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ, నీటి సంఘం డైరెక్టర్ ఎస్.పెంటయ్య, దేవాదాయ శాఖ ఇఒ కె.పద్మావతి, సబ్ రిజిస్టర్ బిజిఎస్‌వి ప్రసాద్, మండల సర్వేయర్ అప్పలనాయుడు, విఆర్ఒ దివ్య, సర్వేయర్‌పాల్గొన్నారు.


మిల్లును ప్రారంభిస్తున్న నాయకులు

రైస్‌మిల్లు ప్రారంభం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం, బుధరాయవలస మార్గం మధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీదుర్గమ్మ మోడరన్ రైస్ మిల్లును టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు గురువారం ప్రారంభించారు. మోడరన్ రైస్ మిల్లు పార్టనర్ మెరకముడిదాం టిడిపి అధ్యక్షులు, మాజీ ఎంపిపి తాడ్డి సన్యాసి నాయుడు ఆహ్వానం మేరకు ఈ మిల్లును ప్రారంభించినట్లు వారు తెలిపారు. మిల్లు ద్వారా కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ. నాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్ నియోజక వర్గంలోని నాలుగు మండలాల కూటమి నాయకులు, మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సొసైటీ మాజీ అధ్యక్షులు

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షులు నారు సింహాద్రి నాయుడు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును గురువారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రేగిడి మండల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జల వనరుల శాఖకు సంబంధించి రేగిడి హెడ్ ఛానల్, సంకిలి సాయన్న ఛానల్ మరమ్మతులకు కృషి చేయాలని కోరారు. తన తమ్ముడు నారు జనార్ధనరావు సంకిలి నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారని తెలిపారు

సంప్రదాయ విజ్ఞానం చాలా గొప్పది

సెంచూరియన్‌లో ఘనంగా అంతర్ విశ్వవిద్యాలయాల గిరిజన సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రాచీన భారతీయ సంప్రదాయ విజ్ఞానం, ఆధునిక విజ్ఞానం కంటే చాలా గొప్పదని అది నేటి మేధస్సుకు కూడా అంతుచిక్కడం లేదని న్యూఢిల్లీకి చెందిన ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజిఎన్సిఎ) మెంబర్ సెక్రటరి ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయాల గిరిజన సాంస్కృతిక సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ముందుగా గిరిజన సాంప్రదాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు చికిత్సకు అందని వైద్యాలన్నింటికీ వేల సంవత్సరాల క్రితమే ప్రాచీన గిరిజనులు చికిత్సలు కనుగొ న్నారని వివరించారు. అది ప్రాచీన భారతీయ విజ్ఞానం గొప్పతనమన్నారు. అక్షరజ్ఞానం లేకుండానే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కనుగొన్నారన్నారు. నేడు విద్యావంతులు ప్రతి పనికి డిజిటల్ టెక్నాలజీపై


గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆధారపడుతున్నారని క్రియేటివిటీ కంప్యూటర్ మీద ఆధారపడుతున్నారని విమర్శించారు. సృజనాత్మకత పెరగాలంటే జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండాలన్నారు. నేటి తరంలో అది తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి మాట్లాడుతూ సెంచూరియన్ విశ్వవిద్యాలయం గ్రామీణ మహిళలు, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గిరిజనులను సర్వతోముఖాభివృద్ధి కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. గిరిజనులు పండించే చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందన్నారు.

మాలవికా జోషి మాట్లాడుతూ భారతీయులు మెరుగైన జీవనం గడపాలన్నదే తమ ఆశయమన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాము పరిష్కారాలు సూచిస్తామన్నారు. అనంతరం గిరిజనులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు, శ్రీ మోదకొండమ్మ నాటిక ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిధి డాక్టర్ విశ్వదీప్ శుక్ల, సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, ఐకెఎస్ ప్రతినిధి డాక్టర్ దేవికారాణి, గిరిజన విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, సమన్వయ కర్త డాక్టర్ ఎస్.వి.సూర్యనారాయణ, డీన్ శరత్ చంద్రబాబు, డీన్ జితేంద్ర మోహన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమవుతుందని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం శ్రీరామ్ కాలనీ యూత్ త్వరలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ బ్యానర్‌ను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఎక్కువ ప్రావీణ్యం చూపడం వల్ల శారీరిక దారుఢ్యం పెరుగుతుందన్నారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా యువత భాగస్వామ్యం కావాలన్నారు. న్యూ ఇయర్, సంక్రాంతి పండగల సందర్భంగా 15 రోజులపాటు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తామని నిర్వాహకులు కొల్లి భాస్కరరావు, బెల్లాన క్రాంతికుమార్ తెలిపారు. భోగి పండగ నాడు ఫైనల్ మ్యాచ్ ఉంటుందని ఇందులో విజేతలకు ప్రథమ బహుమతి షీల్డుతోపాటు రూ.20 వేల నగదు బహుమతి కూడా ఉంటుందన్నారు. ప్రతీరోజూ మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ షీల్డ్‌లు అందజేస్తామని అన్నారు. బెస్ట్ ఆల్రౌండర్ షీల్డ్ కూడా ఇస్తామన్నారు. ఈ నెల 29న ప్రారంభమవుతున్న ఈ టోర్నమెంట్లో ఇప్పటికే 60 టీములు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు, బెల్లాన రవికుమార్, రామ్‌గోపాల్, నల్లి త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు

మాదక ద్రవ్యాలపై పోరాటానికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంకల్పం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి అన్ని వర్గాల ప్రజలూ సహకరించాలని ఎస్ఐ బి.గణేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌పిఆర్ కళాశాల, సతివాడ ప్రభుత్వ మోడల్ కళాశాల, జెటిఎన్ఎం కళాశాలలో విద్యార్థులకు సంక ల్పంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి జిల్లాలో డ్రగ్స్,సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించడానికి సంకల్ప రథాన్ని ప్రారంభించారని ఇందులో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని కాలేజీలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ రథాన్ని జిల్లాలో అన్ని కాలేజీలకి పంపించారని తెలిపారు. అనంతరం ఇంటర్ ఆ పైబడిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు టీవీలో వీడియోలు ప్లే చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సికెఎం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, పాల్గొన్నారు.



వేపాడ: మాట్లాడుతున్న ఎస్ఐ దేవి

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలలో వల్లంపూడి ఎస్ఐ దేవి గురువారం విద్యార్థులకు చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పడకుండా మత్తు పదార్థాలకు బానిసకాకుండా ఉండాలని మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఈ వయసులో ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకొని ప్రయోజకులుగా ఎదగాలని అన్నారు. పాఠశాలకు వచ్చి పోయేటప్పుడు ఎవరైనా ర్యాగింగ్ చేస్తే వెంటనే తనకు సమాచారం ఇస్తే అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రావాడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

వర్షపు జల్లు.. అన్నదాత కుదేలు

ప్రజాశక్తి - గజపతినగరం

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల పరిస్థితి అధ్వానంగా తయారయింది. పంట చేతికొస్తుందన్న సమయంలో ఆనందంతో ఉన్న రైతన్నల ఆశలపై వరుస తుపానులు నీళ్ళు చల్లాయి. నిరంతరాయంగా కురుస్తున్న వర్షంతో గట్ల మీదుగా పారిన నీరు పొలాల్లో చేరి రైతుకు అపార నష్టం చేకూర్చింది. మండలంలోని సుమారు 9,400 ఎకరాల్లో వరి పంట, 890 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేయగా 3,500 ఎకరాల పంట ప్రొక్యూర్మెంట్ సెంటర్లకు చేరగా ప్రస్తుత ఈ తుపాను దాటికి సుమారు 6వేల ఎకరాల్లో వరి పంట నష్టపోయినట్లు చెబుతున్నారు. చాలా చోట్ల ఈ వర్షాలకు వరికి మొలకలు రావడంతో తీవ్రంగా దెబ్బతింది. అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ఇస్తానన్న ఇరవైవేల రూపాయలు గురించి ఇంతవరకు ఏటువంటి స్పందన లేకపోవడంతో ఈ తడిచిన దాన్యం, రంగు మారిన ధాన్యం పట్ల ఏ విధంగా స్పందిస్తుందో అని ఒకరకంగా భయంతో ఉన్నప్పటికీ సానుకూల స్పందన కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. జొన్న విషయానికి వస్తే 260 ఎకరాలు నీటి ముంపునకు గురైంది. దానిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారులు చేస్తున్న బూస్టర్ డోస్ సూచనలను రైతులు పాటించి పంటరక్షణకు ప్రయత్నం చేస్తున్నారు. రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని గత సంవత్సరం మాదిరి ప్రభుత్వం నిర్ణయించిన దరకే కొనుగోలు కేంద్రం తీసుకుంటుంది. జొన్న వేసిన రైతులు బూస్టర్ డోస్ వేసి తమ పంటను కాపాడుకోవచ్చునని ఎఒ సిహెచ్ ధనలక్ష్మి తెలిపారు.


మొలకలు వచ్చిన ధాన్యం

విద్యుత్తు ఛార్జీల పెంపుపై నేడు నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన తెలిపను న్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చెప్పారు. వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీల భారం వేసే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు ఆరు నెలల పాలనలో రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వైసిపి కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలుపుతామని చెప్పారు. నిరసనను జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఉన్నారు.

గజపతినగరం: విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ప్రజలకు తెలిసేలా నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ ఎఇ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి వినతి పత్రం ఇస్తామని చెప్పారు. అనంతరం సంబంధిత గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, కె.పైడుపునాయుడు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

విద్యుత్తు బిల్లులు దహనం

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు రద్దు చేసి స్మార్ట్ మీటర్లు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ ఛార్జీలకు వ్యతిరేకంగా రంగరాయపురం సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో సామాన్యులపై భారాలు వేయడం అన్యాయమన్నారు. ఆదానీ స్మార్ట్ మీటర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేసి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.ప్రసాద్, సింహాచలం, వినియోగదారులు పాల్గొన్నారు.

జెసిబి దొంగ అరెస్టు

ప్రజాశక్తి- రామభద్రపురం

మండల కేంద్రంలో ఈనెల 20వ తేదీన జెసిబిని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన బద్రి హరికృష్ణ ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. గతంలో ఇతడికి జేసీబీ ఉండేదని దీని నిర్వహణ, ఫైనాన్సు వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడం తదితర సమస్యల వల్ల వాహనాన్ని సీజ్ చేసి తరలించుకుపోవడంతో అనేక అగచాట్లుకు గురయాడన్నారు. ఆ ఇబ్బందులతో ఉన్న ఇతనికి ఇక్కడ రాత్రి వేళ పార్కు చేసి ఉన్న జేసీబీ కనిపించడంతో దానిపై అవగాహన ఉండడంతో దీనిని ఎలాగైనా దొంగిలించి తీసుకు పోవాలనే దుర్బుద్ధి పుట్టి అదే రోజు ఇక్కడి నుంచి తెర్లాం మండలం డి.గదబవలస తీసుకు వచ్చి అక్కడ మామిడితోటలో దాచిపెట్టాడు. గురువారం ఈ జేసీబీని తరలించేందుకు వచ్చి పక్కనే ఉన్న ఆయిల్ బంకులో ఆయిల్ వేయించుకొని సిద్ధంగా ఉండగా ఇప్పటికే ఈ వాహనంపై నిఘా ఉంచిన తమ సిబ్బంది వాహనాన్ని గుర్తించి స్వాదీనం చేసుకొని అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెలమల ప్రసాద్, ఏఎస్ఐ అప్పారావు, కానిస్టేబుల్ బాలి విశ్వేశ్వరరావు (విష్ణు)లు పాల్గొన్నారు.

70 బస్తాల బియ్యం సీజ్

ప్రజాశక్తి - విజయనగరం కోట

70 బస్తాల బియ్యం సీజ్ చేశామని విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం విజయనగరం మండలం చెల్లూరు వద్ద చెకింగ్‌లో భాగంగా ఒక బొలెరో వ్యాన్‌ను చెక్ చేయగా అందులో 70 బస్తాల ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి వ్యాన్ డ్రైవర్‌ను ఆరా తీయగా ఇవి బొండపల్లి నుంచి తెస్తున్నట్లు చెప్పినట్లు తెలిపారు. ఎటువంటి ఆధారాలూ లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో తమ సిబ్బంది పాల్గొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

డెంకాడ పోలీసుస్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీసు స్టేషన్‌ను డిఎస్‌పి శ్రీనివాసరావు బుధవారం రాత్రి తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీసు స్టేషన్ పనితీరు, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కానిస్టేబుళ్ల పనితీరును గుర్తించి వారికి ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిఐ జి. రామకృష్ణ, ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఎస్ఐకు ప్రశంసా పత్రం


డెంకాడ ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు సేవలను గుర్తించిన ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రశంసా పత్రాన్ని అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో ఎస్‌పి ఎస్ఐకు ప్రశంసా పత్రం, అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రశంసా పత్రంతో మరింత బాధ్యత పెరిగిందని, పెండింగ్‌లో ఉన్న కేసులను చేధించడనాకి మరింత కృషి చేస్తానని చెప్పారు.


ప్రోత్సాహకాలను అందిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ఘనంగా 'బుద్ధ' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బుద్ధ అప్పలనాయుడు 58వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అప్పలనాయుడుకు శాలువ కప్పి సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఇటువంటి నాయకుడు అవసరమని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి అప్పలనాయుడుకు తినిపించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల బుచ్చి రాంప్రసాద్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, బుద్ధ అప్పలనాయుడు

'నల్లి' సేవలు మరువలేనివి

నెల్లిమర్ల: జరజాపుపేట మాజీ సర్పంచ్ కీర్తి శేషులు నల్లి అప్పలసూర్యనారాయణ (సూరి బాబు) సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం జరజాపుపేటలో నల్లి సూరిబాబు 6వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికోద్యమంలో కీలక పాత్ర పోషించి సూరిబాబు కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన వ్యక్తిని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బొని సత్య వతి, బొని శ్రీనివాసరావు, నల్లి శేఖర్, అవనాపు సత్యనారాయణ, కిల్లంపల్లి రామారావు, కింతాడ కళావతి, తుమ్ము వెంకట రమణ, కానిస్టేబుల్ మద్దిల ప్రసాద్, మద్దిల కృష్ణారావు, బొని వెంకట రమణ పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళి

విజయనగరం టౌన్: వంగవీటి మోహన్ రంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిఎస్ఆర్ కాంప్లెక్సులో ఆయన చిత్రపటానికి జనసేన నేత గురాన అయ్యలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు రంగా చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకూ పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎంటి రాజేష్ , ఎం.పవన్ కుమార్, గొల్లపల్లి మహేష్, సుంకరి వంశీ, పృథ్వీ భార్గవ్, పి.అభిలాష్ , డి.హిమంత్ పాల్గొన్నారు.